క్లుప్తంగా

మే 5 నుంచి ఉచిత వేసవి శిక్షణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో 4వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బాలోత్సవ కమిటి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భూపతివెంకటేశ్వర్లు, ఎన్.సామయ్య, ఉపాధ్యక్షులు సుజావతిలు తెలిపారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమ్మర్ క్యాంప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. శిక్షణ కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకునేందుకు 94900 98343, 94900 98676లలో సంప్రదించవచ్చు.

అమ్మవారికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని ఆంధ్ర కేఫ్ చౌరస్తాలో శ్రీ ముత్యాలమ్మదేవాలయం వార్షికోత్సవ వేడుకలలో గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకరిస్తానన్నారు. బీజేపీ యువ నాయకులు వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



ముషీరాబాద్: రాంనగర్ ప్రధాన రహదారిలోని ప్రార్థన వీరుల సంఘం(చర్చి)లో గురువారం 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా శిబిరాన్ని రెవరెండ్ డా.ఎం.మరిదాస్, మేరిలినా ప్రార్థన ద్వారా ప్రారంభించారు. మే 10వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. సంఘం కాపరి, వైస్ ప్రెసిడెంట్ ఎం.యోఫ్తా తెలిపారు.

క్లీన్ అండ్ గ్రీన్



ముషీరాబాద్: రాంనగర్ చౌరస్తా నుంచి వీఎస్టీ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించాలని స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 ఏఎంఓహెచ్ మైత్రేయికి ఆదేశించారు. గురువారం ఆ పనులను రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు ఆర్.మోజెస్ పర్యవేక్షణలో వ్యర్థాలను తొలగించారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దుకాణదారులకు విజ్ఞప్తి చేశారు.

వేసిన రెండు నెలలకే కుంగిన రోడ్డు



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ గజేంద్రప్యాలెస్ వద్ద మెయిన్‌రోడ్డు కుంగిపోయింది. పైపై మెరుగులు దిద్ది రోడ్డును కంకర, మట్టి, డస్ట్‌తో రోడ్డును పూడ్చేశారు. భారీ వాహనం వచ్చి ఈ గుంతపై నుంచి వెళ్తే రోడ్డు కుంగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది సమీపంలోని అరుంధతినగర్, సబర్మతినగర్ బస్తీవాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గాంధీనగర్ లింక్‌బ్రిడ్జి వద్ద ఇటీవల భారీ లోడ్‌తో వస్తున్న ట్రక్కు కూడా దిగబడిపోయింది. ఇప్పుడు అక్కడ మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయి. అయితే గజేంద్రప్యాలెస్ వద్ద కూడా రోడ్డు కుంగిపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



ముషీరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్ జోన్ బృందం: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ముషీరాబాద్ నియోజకవర్గంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు కూడళ్లలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే తనయుడు ముఠా జైసింహతో పాటు పలువురు పార్టీ జెండాలను ఆవిష్కరించారు.



సుందరయ్య పార్కులో భారీ వాహనాల అక్రమ పార్కింగ్



సుందరయ్య పార్కులో అక్రమంగా పార్కింగ్ చేసిన భారీ ప్రైవేటు వాహనాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన సుందరయ్య పార్కులో కొంతకాలంగా అక్రమంగా కొన్ని ప్రైవేటు వ్యక్తులకు చెందిన భారీ వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల వాకర్స్ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల రూ.80 లక్షల నిధులతో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ పార్కును అన్ని విధాలుగా సుందరీకరించారు. ముఖ్యంగా నూతనంగా వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఈ భారీ వాహనాలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుండడంతో వాకింగ్ ట్రాక్ గుంతమయమైందని వాకర్స్ ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో రోజుల నుంచి పోరాటం చేయగా ఎమ్మెల్యే స్పందించి వాకర్స్ సభ్యుల సౌకర్యం కోసం నూతనంగా ట్రాక్‌ను ఏర్పాటు చేస్తే ఈ భారీ వాహనాల కారణంగా ఉన్నటువంటి ట్రాక్ చిన్నాభిన్నం అయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. అసలే రానున్న వర్షాకాలంలో ఇలాంటి గుంతలు ఏర్పడితే నీళ్లు నిలిచిపోయి వాకింగ్ చేయడానికి అనుకూలంగా ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున భారీ వాహనాలను సుందరయ్య పార్కులో పార్కింగ్ చేస్తున్నప్పటికి సంబంధిత సూపర్‌వైజర్‌గానీ, జీహెచ్‌ఎంసీ అధికారులుగానీ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని వాకర్స్ విమర్శిస్తున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వాహనాదారులు వినిపించుకోకుండా ఇక్కడే పార్కింగ్ చేయడానికి ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎక్కడ ఈ వాహనాలను పార్కింగ్ చేశారో అక్కడే పార్కింగ్ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు. లేకుంటే వాహనాలను లోనికి రానియ్యకుండా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



వాహనాల రాకపోకలతో ఏర్పడ్డ గుంతలను చూపిస్తున్న వాకర్స్

దెబ్బతింటున్న వాకింగ్ ట్రాక్



నిత్యం భారీ వాహనాల రాకపోకల వల్ల ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ దెబ్బతింటోంది. వర్షాకాలం ప్రభావంతో వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల గుంతలు ఏర్పడుతున్నాయి. వాకర్స్ సభ్యులంతా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నప్పటికి అక్రమ పార్కింగ్ చేస్తున్న వెంటనే అధికారులు స్పందించి ఇక్కడ పార్కింగ్ చేస్తున్న ప్రైవేటు వాహనాలను ఎత్తివేయాలి.

– పి.వి.నిరంజన్‌రెడ్డి, వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రామసుబ్బారావును అభినందిస్తున్న యూనియన్ సభ్యులు

ముషీరాబాద్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని, ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు మే చివర వారం లోగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరంలోపు అన్ని పాఠశాలల్లో అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులను నియమించాలని నూతనంగా ఎన్నికైన ఎస్‌టియూటీఎస్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామసుబ్బారావు ప్రభుత్వాన్ని కోరారు. కాచిగూడలోని ఎస్‌టీయూ భవన్‌లో గురువారం యూనియన్ అధ్యక్షులు ఇష్తేకారుద్దీన్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న మండడి నర్సింహారెడ్డి వ్యక్తిగత కారణాల దృష్ట్యా రాజీనామా చేయగా ఏర్పడిన ప్రధాన కార్యదర్శి పదవీకి ఏకగ్రీవంగా పి.రామసుబ్బారావు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.పర్వతరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం



మాట్లాడుతున్న తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య విమర్శించారు. ప్రభుత్వాల వైఖరికి నిరసనగా జూన్ 1 నుంచి తమ పోరాటాలను తీవ్రతరం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ వరంగల్‌లో జక్కలొద్దిన్‌లో ప్రారంభమైన ఇండ్లు, ఇళ్ల స్థలాల పోరాటం 67 కేంద్రాలకు విస్తరించి ఏడాది కాలంలో కొనసాగుతుందని తెలిపారు. 37 వేల మంది పేదలు ఆయా కేంద్రాల్లో గుడిసెలు వేసుకోని నివసిస్తున్నారని అన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండగా మరోవైపు కొన్ని కేంద్రాల్లో పోలీసులు, మరి కొన్ని కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకుల గుండాలతో దౌర్జన్యాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పట్నం రాష్ట్ర కార్యదర్శి డి.జి.నర్సింహ్మారావు, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సాగర్, సిఐటియూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న ప్రజాదరణ



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు

కాచిగూడ: పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాలకు రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు తెలిపారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలతో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. గురువారం కాచిగూడలో ఎలక్ట్రిక్ వాహనాలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తూ కొనుగోలుదారులకు సబ్సిడీని ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నేత వేంరెడ్డి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వెంటనే హాల్‌టికెట్స్ ఇవ్వాలి

ముషీరాబాద్: మసాబ్‌ట్యాంక్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న 800 మంది విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వక పరీక్షలకు హాజరుకాకుండా విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్న పాలిటెక్నిక్ కళాశాల అధికారులపై చర్యలు తీసుకోఆవలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్, మహంకాళీ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు మద్దూరి శివాజీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆందోళన చసిన బీజేవైఎం కార్యకర్తలను గురువారం పోలీసులు అరెస్టు చేసి ముషీరాబాద్ పీఎస్‌కు తరలించారు. అరెస్టైన కార్యకర్తలను భానుప్రకాష్, మద్దూరి శివాజీలు పరామర్శించి మాట్లాడారు.



అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్లాన్

- టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ
- అంబర్‌పేట సర్కిల్‌లో ఇప్పటి వరకు 250 భవనాలకు నోటీసులు

అంబర్‌పేట: అగ్నిప్రమాదాల నివారణకు జీహెచ్‌ఎంసీ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని వ్యాపార సముదాయాలు, భవనాలకు అగ్నిమాపక శాఖ నుండి ఎన్‌ఓసీ సర్టిఫికెట్ లేనివాటని గుర్తించే పనిలో పడ్డారు. అలాగే ప్రమాదకర సెల్లార్లు ఉన్న భవనాలను గుర్తిస్తున్నారు. అగ్నిప్రమాదం, వరదనీటితో ఇబ్బందులు తలెత్తే నిర్మాణాలకు గత కొన్ని రోజులుగా టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో ఉన్న ఆరు డివిజన్లలో సుమారు 250 భవనాలకు నోటీసులు ఇచ్చారు.

స్పందించకుంటే చర్యలు......?

జీహెచ్‌ఎంసీ జారీచేసే నోటీసులకు భవన యజమానులు స్పందించకుంటే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇటీవల నగరంలో పలు వ్యాపార సముదాయాల్లో జరిగిన అగ్నిప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ యంత్రాంగం ప్రత్యేక దిద్దుబాటు చర్యలకు దిగింది. అధికారులు గత పది రోజులుగా ప్రధానంగా హిమాయత్‌నగర్, శివం రోడ్డు, నల్లకుంట, నారాయణగూడ రద్దీ ప్రాంతాల్లో ఉన్న భవనాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు దృష్టి సారించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు జారీ చేసిన నోటీసులకు భవన యజమానులు స్పందించాలని అధికారులు కోరుతున్నారు.

నేడు అవగాహన సమావేశం

ఇప్పటి వరకు నోటీసులు జారీ చేసిన భవన యజమానులకు ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నట్లు సర్కిల్–16 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సాయిబాబ తెలిపారు. నోటీసులు అందుకున్న భవన యజమానులు ప్రమాధాల నివారణకోసం నిర్వహించే అవగాహన కార్యక్రమానికి హాజరై సహకరించాలన్నారు. ఉదయం 11 గంటలకు అబిడ్స్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో 3వ అంతస్తులో సమావేశం నిర్వహిస్తామన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్

కాచిగూడ: చట్టసభల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడ, మోతీమార్కెట్‌లోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని 70కోట్ల మంది బీసీల సమగ్రాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అన్నారు. బీసీ కులాల వారిగా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలు, నిధుల కేటాయింపునకు జనగణనలో కులగణన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్ర కాలనీలో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కె.నర్సింగ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్ర కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాతల్ ఆదేశాల మేరకు జలమండలి మేనేజర్ నవీన్ ప్రతిపాదనలు రూపొందించారు. ఈ సందర్భంగా గంగపుత్ర కాలనీలోని 44 బస్టాప్ నుంచి శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం వరకు పైపులైన్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బుద్వేల్ – ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం, గొల్లగూడ గ్రామానికి చెందిన మహ్మద్ వహీద్ అలీ కుమారుడు మహ్మద్ పాషా (29) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఔషధాలు అక్రమ నిల్వ చేసిన వైద్యుడికి మూడేళ్ల జైలు

ముషీరాబాద్: ఏవిధమైన అనుమతులు లేకుండా తన ఇంట్లో అక్రమంగా ఔషధాలు నిల్వ చేసి ఔషధ అధికారులకు పట్టుబడిన ఓ వైద్యుడికి అతడికి అక్రమంగా మెడిసిన్స్ సరఫరా చేసిన మరో వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తు నాంపల్లి కోర్టు తీర్పు వెల్లడించింది. ముషీరాబాద్ ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గంట్ల అనిల్‌రెడ్డి తెలిపిన మేరకు.. 2015 సంవత్సరంలో చిక్కడపల్లి పరిధిలోని వివేక్‌నగర్‌లో స్థానికంగా ఆర్థోపెడిక్ వైద్యుడు రామకృష్ణ తన ఇంట్లో అక్రమంగా ఔషధాలను నిల్వ చేయగా అప్పటి ఔషధ నియంత్రణ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా డాక్టర్ తన ఇంట్లోనే మెడిసిన్స్ నిల్వ చేయడంతో అధికారులు కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు చేశారు. నాంపల్లి కోర్టులో విచారణ సందర్భంగా కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఉదయభాస్కర్‌రావు డాక్టర్ రామకృష్ణకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 4.95 లక్షల జరిమానా విధిస్తు తీర్పు వెల్లడించారు. అంతే కాకుండా డాక్టర్ రామకృష్ణకు అక్రమంగా ఔషధాలను సరఫరా చేసిన రతన్ అనే వ్యక్తికి మూడు సంవత్సరాల కారాగార శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానాను విధించారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టబోయే ఆందోళన, పోరాటాల్లో సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం రూ.20 లక్షలు చెల్లించాలని తదితర డిమాండ్లతో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ సభ గురువారం జరిగింది.

మేడే సందర్భంగా భారీ ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి

ముషీరాబాద్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందరగా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో వైఎంసిఏ చౌరస్తా నారాయణగూడ నుంచి ముషీరాబాద్ చౌరస్తా వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సిఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి వెల్లడించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విచిత్ర వేషాలు, కళారూపాలు, డప్పులు, మహానాయకుల కటౌట్లతో ఈ ప్రదర్శన యూనియన్ల అడ్డాలల్లో ఉదయం 9 గంటలలోపు జెండా ఆవిష్కరణలు పూర్తి చేసుకోని 10 గంటల ఈ ప్రదర్శనలో పాల్గొనాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

దళిత క్రైస్తవ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న శనివారం సికింద్రాబాద్‌లోని మిలీనియం మెథడిస్ట్ చర్చిలో జరిగే దళిత క్రైస్తవ జాతీయ సదస్సు పోస్టర్‌ను గురువారం తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ బి. వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు, రాష్ట్ర అధ్యక్షుడు బ్రదర్ ప్రదీప్ నారబోయిన, రాష్ట్ర కో ఆర్డినేటర్ కొత్తపల్లి గిడియోను బాబు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు యస్సీ హోదా కల్పించాలని అన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్

ఎస్సీ వర్గీకరణ సదస్సును జయప్రదం చేయాలి



బాగ్‌లింగంపల్లిలో జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో పాల్గొన్న గజ్జల రాజశేఖర్‌మాదిగ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ లక్ష్యసాధన కోసం మే 15న హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ ముషిరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ గజ్జల రాజశేఖర్‌మాదిగ పిలుపునిచ్చారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఎల్‌ఐజీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గజ్జల రాజశేఖర్‌మాదిగ మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వేషన్ కోసం పోరాటం చేస్తున్నప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకుండా మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు నిర్వహించే ఈ బహిరంగ సదస్సును జయప్రదం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా మాదిగలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జీ వి.ఎస్.రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బి.గణేష్‌మాదిగ పాల్గొన్నారు.

హెబ్రోన్‌లో ప్రారంభమైన బైబిల్ తరగతులు



చర్చి ఆవరణలో తరగతులు నిర్వహిస్తున్న టీచర్లు, పాస్టర్లు

చిక్కడపల్లి: గోల్కొండ చౌరస్తాలోని ప్రసిద్ధిచెందిన హెబ్రోన్ చర్చిలో బైబిల్ తరగతులు ఘనంగా జరుగుతున్నాయి. వేసవిలో 12 రోజులపాటు కేజీనుంచి పీజీ చదివే పిల్లలు, యువతీ,యువకులకు టీచర్లు, పాస్టర్లు ఈ తరగతులు నిర్వహిస్తారు. ప్రతి వేసవిలో నిర్వహించిన విధంగానే జరుగుతున్న తరగతులకు తొలిరోజు జంటనగరాలనుంచి దాదాపు 500 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమాలు రాబోయే తరంవారిలో ఆధ్యాత్మిక చైతన్యానికి దైవికచింతనను పెంచడానికి ఏసుప్రభువు బోధనలు తెలుసుకోవడానికి, మానసిక వికాసం కోసం బైబిల్ తరగతుల నీతి, శాంతి బోధనలు దోహదపడుతాయని ఈ తరగతులను నిర్వహిస్తున్న హెబ్రోన్ సొసైటి చైర్మన్, దైవసేవకులు జోసఫ్ పి.కురియన్, సొసైటి ప్రధాన కార్యదర్శి రాగి పీటర్ వీరాచారిలు గురువారం సాయంత్రం తెలిపారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: డివిజన్ పరిధిలోని మణియార్ పట్టి బస్తీలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారుల బృందం ప్రతినిధులు లాల్‌భాషా, దిన్‌సిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం న్యాయవాదుల నిరాహార దీక్ష

కాచిగూడ: న్యాయవాదులపై జరుగుతున్న దాడుల నివారణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న అడ్వకేట్స్ జేఏసీ కార్యాలయంలో నిరాహార దీక్ష చేపడుతున్నట్లు సౌత్ ఇండియా అడ్వకేట్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుధా నాగేందర్ తెలిపారు. అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నామాల శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం అడ్వకేట్స్ జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరాహార దీక్ష పోస్టర్‌ను సుధా నాగేందర్ ఆవిష్కరించారు. న్యాయవాదులపై దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని, వీటిని నివారించడానికి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.



ఘనంగా భగీరథ జయంతి ఉత్సవం



భగీరథ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: భగీరథ వంశీయులైన సగర(ఉప్పర)లకు విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కల్పించాలని, సగర ఫెడరేషన్‌కు బడ్జెట్‌లో 500 కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో భగీరథ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన సగరులను అన్ని రంగాల్లో ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సగర హక్కుల పోరాట సమితి అధ్యక్షులు నీరడి భూపేష్‌సాగర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నందగోపాల్, సుధాకర్, వేముల రామకృష్ణ, రాజ్‌కుమార్, అంజి, సంతోష్, రాకేష్, నర్సింహ్మాగౌడ్, లక్ష్మి రేఖ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.